# నిఘా నీడలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్



నగరంలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు

- కట్టుదిట్టమైన బందోబస్తు చర్యలు
- పోలింగ్ ప్రక్రియ సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ
- భద్రతలో ట్రైనీ ఎస్సైలు, మహారాష్ట్ర పోలీసు బలగాలు
- అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- భద్రతను పర్యవేక్షించిన సీపీ కల్మేశ్వర్

నిజామాబాద్ క్రైం, నవంబర్ 30 : జిల్లాలో గురువారం నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికలు పోలీసుల కట్టుదిట్టమైన భద్రత, నిఘా మధ్య ప్రశాంతంగా ముగిశాయి. జిల్లావ్యాప్తంగా ఉన్న ఆరు నియోజకవర్గాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ చర్యలు చేపట్టారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజీ ద్వారా పోలింగ్ ప్రక్రియను కమిషనరేట్‌లోని కమాండ్ కంట్రోల్ ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు.

సుమారు 5 వేల మంది కేంద్ర బలగాలు, సివిల్, స్పెషల్ పార్టీ, క్యూఆర్టీ బృందాలు భద్రత నిర్వహించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద 100 మీటర్ల వరకు ఓటర్లను తప్ప ఇతరులను అనుమతించకుండా చర్యలు తీసుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను అనుమతించకుండా కట్టడి చేశారు. ప్రతి కేంద్రం పరిధిలో మొబైల్ పెట్రోలింగ్ పార్టీలు పర్యటిస్తూ గుమిగూడిన జనాలను చెదరగొట్టారు.

బందోబస్తులో ట్రైనీ ఎస్సైలు..

పోలింగ్ సెంటర్ల వద్ద భద్రత విధులు నిర్వర్తించేదుకు ప్రత్యేకంగా శిక్షణలో ఉన్న ఎస్సైలను వినియోగించారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో ఎస్సైలుగా శిక్షణ పొందుతున్న మహిళా/పురుష సిబ్బందికి బందోబస్తు విధులను అప్పజెప్పారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సుమారు 30 మంది వరకు ట్రైనీ ఎస్సైలు విధులు నిర్వహించారు. ఆరు నెలల పాటు శిక్షణలో ఉన్న ఎస్సైలకు ఇప్పటివరకు కేవలం మూడు నెలల శిక్షణ మాత్రమే పూర్తి చేసుకున్నపటికీ, ఎన్నికల విధుల్లో నిర్వహించాల్సిన విధులపై అవగాహన కల్పించేందుకు డ్యూటీ వేసినట్లు అధికారులు తెలిపారు. మహారాష్ట్రలోని పర్బనీ, నాందేడ్, లాథూర్ ప్రాంతాలకు చెందిన పోలీసులు సైతం బందోబస్తులో పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా కొనసాగిన 144 సెక్షన్ ..

జిల్లా వ్యాపంగా ఉన్న ఆరు నియోజకవర్గాల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంచారు. కేంద్రాలకు పరిసర ప్రాంతాల్లో ప్రజలు ఎక్కువ మొత్తంలో గుమిగూడకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. నిజామాబాద్ నగరంలోని సుభాష్‌నగర్ ప్రాంతంలోని ఎస్ఎఫ్ఎస్ పోలింగ్ సెంటర్ వద్ద వివిధ పార్టీలకు చెందిన సభ్యులు వంద మీటర్ల పరిధిలో ఎన్నికల ప్రచారం చేస్తుండగా.. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు వారిని వారించారు. వారు పోలీసులకు ఎదురుచెప్పడంతో సీపీ కల్మేశ్వర్ ఘటనా స్థలానికి చేరుకొని వారిని చెదరగొట్టేందుకు స్వల్ప లాఠీచార్జి చేశారు. అక్కడ నుంచి జనాలు వెళ్లిపోవడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగియడం, కట్టుదిట్టమైన భద్రత మధ్య ఈవీఎంలను తరలించడంతో పోలీసులు, అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి వేముల

వేల్పూర్, నవంబర్ 30 : బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఓటు హక్కును కుటుంబ సభ్యులతో కలిసి గురువారం మంత్రి స్వగ్రామంలోని వేల్పూర్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వంను గెలిపిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులపై ఆకర్షితులై ప్రతిఒక్కరూ కూడా ప్రభుత్వం వైపే మొగ్గు చూపారన్నారు.

**పోలింగ్ బూత్‌ల పరిశీలన**

మెండోరా, నవంబర్ 30: మండల కేంద్రంలో పోలింగ్ బూత్‌లను మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పరిశీలించారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు, ప్రజలతో మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహిస్తున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. పోలింగ్ శాతం గతంలో కంటే పెరిగేలా చూడాలన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి ఓటును వినియోగించుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట స్థానిక నాయకులు, మార్కెట్ కమిటీ చైర్మన్ అరుణ నవీన్‌గౌడ్, జడ్పీటీసీ తలారి గంగాధర్, సొసైటీ చైర్మన్ రాజారెడ్డి, సర్పంచ్ మచ్చర్ల రాజారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

**ఓటు వేసిన బోధన్ అభ్యర్థి షకీల్**

బోధన్, నవంబర్ 30: బోధన్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్ గురువారం తన సతీమణి ఆయేషా ఫాతిమా, ఇద్దరు కుమార్తెలతో కలిసి ఓటుహక్కును వినియోగించుకున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు వారు బోధన్ పట్టణం శక్కర్‌నగర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని 89వ నంబర్ పోలింగ్‌బూత్‌లో ఓటువేశారు. 89వ నంబర్ ఓటర్ల జాబితాలోని 932వ సీరియల్ నంబర్ ఓటును హమ్మద్ షకీల్ వినియోగించుకోగా, 933వ సీరియల్ నంబర్ ఓటును ఆయన సతీమణి ఆయేషా ఫాతిమా, 935,936 సీరియల్ నంబర్ల ఓట్లను ఆయన కుమార్తెలు ఫాతిమా ఆమేర్, సుమయా ఆమేర్ వేశారు. అంతకు ముందు వారు పోలింగ్‌బూత్ ప్రాంగణంలోని విక్టరీ సింబల్‌ను చూపుతూ ప్రవేశించారు. అనంతరం మిగతా ఓటర్లతో పాటు క్యూలో నిలబడి తమ వంతు రాగానే ఓటుహక్కును వినియోగించుకున్నారు.

### మామిడిపల్లి హైస్కూల్‌లో ఓటు వేసిన ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

ఆర్మూర్‌టౌన్, నవంబర్30: పట్టణంలోని మామిడిపల్లి హైస్కూల్‌లోని 37వ బూత్‌లో ఆర్మూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జీవన్‌రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి గురువారం ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా మొట్టమొదటి సారిగా ఎమ్మెల్యే కుమార్తెలు అనౌశిక రెడ్డి, అనన్య రెడ్డి సైతం ఓటుహక్కును వినియోగించుకున్నారు.

## మధ్యాహ్నం ఒంటి గంట నుంచి పుంజుకున్న పోలింగ్

బోధన్, నవంబర్ 30: బోధన్ అసెంబ్లీ నియోజకవర్గంలో చెదురుమదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. భారీ భద్రత మధ్య జరిగిన పోలింగ్‌లో ఓటర్లు తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకున్నారు. నియోజకవర్గంలోని 246 పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ ప్రశాంతంగా జరిగినట్లు, పోలింగ్‌కు ఎటువంటి అంతరాయాలు ఏర్పడలేదని ఎన్నికల అధికారులు తెలిపారు. గురువారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ 5 గంటలకు ముగిసింది. బోధన్ పట్టణంలోని అనేక పోలీస్ స్టేషన్లలో పోలింగ్ రాత్రి 7 గంటల వరకు జరిగింది. సాయంత్రం 5 గంటలలోపు పోలింగ్ స్టేషన్ ప్రాంగణంలోని వచ్చినవారికి పోలింగ్ సిబ్బంది టోకెన్లు అందించి, వారు ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. సాయంత్రం 5 గంటల వరకు బోధన్ నియోజకవర్గంలో 68.95 శాతం పోలింగ్ నమోదు అయినట్లు బోధన్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజాగౌడ్ గురువారం సాయంత్రం తెలిపారు. అనేక పోలింంగ్ స్టేషన్లలో పోలింగ్ కొనసాగుతున్నందున, ఈ పోలింగ్‌శాతంలో స్వల్పంగా మార్పు ఉండే అవకాశముందని, ఖచ్చితమైన పోలింగ్ శాతం తర్వాత ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు. బోధన్ నియోజకవర్గంలో పోలింగ్ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మందకొడిగా జరిగింది. మధ్యాహ్నం 1 గంట నుంచి పుంజుకున్న పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు జోరుగా సాగింది.

## సజావుగా పోలింగ్

భీమ్‌గల్,నవంబర్ 30: బాల్కొండ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఎన్నికలు సజావుగా జరిగాయి. ఉదయం నుంచే ఓటర్లు బారులు తీరారు. ఓటింగ్ ముగిసే సమయానికి 79 శాతంగా పోలింగ్ నమోదైందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిత్రామిశ్రా తెలిపారు

### బాల్కొండ నియోజకవర్గంలో మండలాల వారీగా పోలింగ్ శాతం

| మండలం | మొత్తం ఓట్లు | పోలైన ఓట్లు | పోలింగ్ శాతం |
|---|---|---|---|
| బాల్కొండ | 24,862 | 19454 | 78.82 |
| ముప్కాల్ | 15,682 | 12,847 | 81.48 |
| మెండోరా | 20,272 | 15,564 | 76.78 |
| మోర్తాడ్ | 26,445 | 21,405 | 80.94 |
| ఏర్గట్ల | 13,964 | 11,724 | 83.96 |
| కమ్మర్‌పల్లి | 33,388 | 26,604 | 79.68 |
| భీమ్‌గల్ | 50,806 | 39,145 | 77.05 |
| వేల్పూర్ | 36,118 | 28,876 | 79.95 |
| మొత్తం | 2,21,443 | 1,75,619 | 79.31 |

## లక్కాపూర్ సర్పంచ్ కారు ధ్వంసం

**కాంగ్రెస్ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు**




ధ్వంసమైన కారు అద్దాలు

చందూర్, నవంబర్ 30 : మండలంలోని లక్మాపూర్ చెందిన సర్పంచ్ బొడ్డోళ్ల సత్యనారాయణకు చెందిన కారు అద్దాలను గురువారం తెల్లవారుజామున కొందరు వ్యక్తులు రాళ్లతో ధ్వంసం చేశారు. కారును ధ్వసం చేసింది కాంగ్రెస్ నాయకులేనని సర్పంచ్ తెలిపారు. అభివృద్ధి చూసి ఓర్వలేక, అధికారంలోకి రాబోమని తెలుసుకొని కాంగ్రెస్ నాయకులు తన కారు అద్దాలను పగులగొట్టినట్లు ఎస్సై కృష్ణకుమార్‌కు సర్పంచ్ సత్యనారాయణ ఫిరాయదు చేశారు.

## మోస్రాలో పోచారం పర్యటన

మోస్రా (చందూర్), నవంబర్ 30 : మోస్రా మండల కేంద్రంలో పోలింగ్ ముగిసిన అనంతరం స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి గురువారం రాత్రి పర్యటించారు. నెలరోజులుగా ప్రచారం చేసిన బీఆర్ఎస్ నాయకులతో సభాపతి పోచారం ముచ్చటించారు. పోలింగ్ ఎలా జరిగిందని నాయకులకు అడిగి తెలుసుకున్నారు. తనకు మద్దతుగా ముమ్మర ప్రచారం చేసిన నాయకులు, కార్యకర్తలను అభినందించారు. పోచారం వెంట పోచారం సురేందర్‌రెడ్డి, ఎంపీపీ పిట్ల ఉమా శ్రీ రాములు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోచారం భారీ మెజార్టీతో గెలవాలని పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ సర్పంచ్ స్వరూప, కాలనీవాసులు

కోటగిరి, నవంబర్ 30 : బీఆర్ఎస్ బాన్సువాడ ఎమ్మెల్యే అభ్యర్థి పోచారం శ్రీనివాసరెడ్డి భారీ మెజార్టీతో గెలవాలని కోరుతూ కోటగిరి మండల కేంద్రంలోని పోచారం కాలనీలో ఉన్న హనుమాన్ మందిరంలో బీఆర్ఎస్ నాయకులు, కాలనీవాసులు గురువారం పూజలు చేశారు. కోటగిరి మాజీ సర్పంచ్ స్వరూప ఆధ్వర్యంలో పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడే పోచారం శ్రీనివాసరెడ్డి భారీ మెజార్టీతో గెలవాలని కోరారు.

## గోసం బస్తీలో స్వల్ప వివాదం

**ఇరువర్గాలను చెదరగొట్టిన పోలీసులు**



కాలనీవాసులను సముదాయిస్తున్న పోలీసులు

శక్కర్‌నగర్, నవంబర్ 30:అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా బోధన్ పట్టణం 10వ వార్డులోని గోసం బస్తీలో గురువారం స్వల్ప వివాదం జరిగింది. ఉదయం కాలనీకి చెందిన పలువురు ఎవరూ ఏ పార్టీకి ఓటు వేయవద్దంటూ, పోలింగ్ కేంద్రానికి వెల్లే రహదారికి అడ్డంగా ముళ్ల కంప వేసారు. కాగా, కాలనీ వాసులతో ఓట్లు వేయించేందుకు ఇరుపార్టీలకు చెందిన పలువురు నాయకులు రావడంతో, ఇరు వర్గాల మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. పరిస్థితిపై సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. అనంతరం కాలనీ వాసులతో స్థానిక పట్టణ సీఐ బీడీ ప్రేమ్ కుమార్ మాట్లాడి వారిని సముదాయించారు. ఓటు నిరభ్యంతరంగా వేసుకోవాలని వారికి చెప్పారు. కాలనీకి చెందిన మహిళలు, పురుషులు కనీసం వందమందికి పైగా కొంతసేపు ఆందోళన చేపట్టారు. అనంతరం పోలీసుల జోక్యంతో వారు అక్కడి నుంచి వెల్లిపోయారు.